
సాక్షి మంచిర్యాల

శనివారం । 20 । జనవరి । 2024



ఆహా రామా.. అయోధ్య రామా..

అద్భుత ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కనువిందు చేయనుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. 8లో▸

పనులు పూర్తి చేయాలి

లక్సెట్టిపేట: గ్రామాల్లో పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని జెండా వెంకటాపూర్‌లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అంగన్‌వాడీ భవనాల్లో తాగునీరు, శానిటేషన్, బరువు కొలిచే యంత్రాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామసభలో పనులపై ప్రజాప్రతినిధులతో చర్చించారు. గ్రామ సర్పంచ్ సునీత, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి

- టీఎస్‌ఎన్పీడీసీఎల్ చైర్మన్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ వరుణ్‌రెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్లలో నష్టాలు కలుగకుండా, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వినియోగానికి అనుగుణంగా 100 శాతం బిల్లులు వసూలు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల కుల ధ్రువీకరణ పత్రాలు యుద్ధ ప్రాతిపదికన సేకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్ట్స్, ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ సంధ్యారాణి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, ఎస్ఈ శేషారావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అభివాదం చేస్తున్న ఎంపీ వెంకటేశ్‌నేత

జైపూర్: అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేశ్‌నేత తెలిపారు. మండలంలోని నర్వ గ్రామంలో స్థానిక సర్పంచ్ దుగుట రాజ్‌కుమార్, నేతకాని మహర్ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పాట్లాల నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం నేతకాని మహర్ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్‌తో కలిసి ఎంపీ వెంకటేశ్ నేత ప్రారంభించారు. అన్నివర్గాల ప్రజలు, కులసంఘాల ప్రతినిధులతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా కులసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞానమేళా



ఫ్లోర్ క్లీనర్ ప్రదర్శించిన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ఆన్‌లైన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన మేళా ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన 116 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రాజ్యస్థాయిబాల వైజ్ఞానిక ప్రదర్శన(ఆర్‌ఎస్‌బీవీపీ) జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన వివరాలను డీఈవో యాదయ్య ప్రకటించారు. ఐదు ఉప అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ఒక్కో ఉప అంశానికి జూనియర్, సీనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన పది మందిని ఎంపిక చేశారు. టీచర్ బోధనాభ్యాసన పరికరాల విభాగంలో ఉపాధ్యాయుడు గంప శ్రీనివాస్, సెమినార్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని వర్షిత, అగ్రికల్చర్‌లో కేజీబీవీ మంచిర్యాల విద్యార్థిని వైష్ణవి, మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నిత్యశ్రీ, హెల్త్‌లో బాదంపల్లి జెడ్పీఎస్ఎస్‌కు చెందిన జగదీశ్వర్, బెల్లంపల్లి టీఎస్ఆర్ఎస్‌జేసీ(బీ)కు చెందిన గంగారాం, టీఎస్ఎంఎస్ కాసిపేటకు చెందిన ప్రమీల్‌కుమార్, బూర్గుపల్లికి చెందిన సందీప్, కమ్యూనికేషనల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అంశంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జేసీ(బాయ్స్) కాసిపేటకు చెందిన సుశాంత్, మల్కపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన శాంతరాజ్, లైఫ్–లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాల్‌మెంట్‌లో ఆశ్రమ పాఠశాల మల్కపల్లికి చెందిన మనక్‌రావు, జెడ్పీహెచ్ఎస్ వీగాంకు చెందిన శ్రీనిత ఎంపికయ్యారు.

22న రిటైర్డు కార్మికుల ధర్నా

పాతమంచిర్యాల: సింగరేణి రిటైర్డు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 22న కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు రిటైర్డు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు కట్టపోచమ్మ దేవాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు బి.కృష్ణ, శేశాంకర్‌రావు, వొడ్నాల శ్యాంసుందర్, రాంరెడ్డి, అడిసేల రాజేశం, చిప్ప రామస్వామి పాల్గొన్నారు.

బడిలో ఎన్నికల గంట



గర్మిళ్ల పాఠశాల భవనం

ప్రభుత్వ ఆదేశాలతో..



ప్రభుత్వ ఆదేశాలతో సర్కారు బడుల్లో ఎన్నికలు నిర్వహించనున్నాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్షుణ్ణంగా చదివి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి. పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికలకు చొరవ తీసకుంటాం. ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ ఆఫీసర్లు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి ఎన్నికలు సజావుగా జరిగేలా ఆదేశించాం.
– యాదయ్య, డీఈవో

- నేడు ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- నాలుగేళ్ల తర్వాత గ్రీన్‌సిగ్నల్
- 29న స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ ఎన్నికలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాల పర్యవేక్షణలో కీలకమైన స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండేళ్ల కాలపరిమితితో ఎన్నికైన గడువు ముగిసిపోగా పొడిగిస్తూ వచ్చారు. జిల్లాలో 839 ప్రభుత్వ పాఠశాలలకు గాను 2019 నవంబర్‌లో 747 బడుల్లో ఎన్నికలు నిర్వహించగా.. 92చోట్ల కోరం లేక వాయిదా పడ్డాయి. ఈ నెల 20న శనివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మధ్యాహ్నం 2గంటల్లోపు అన్ని స్కూళ్లలో విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా ప్రదర్శిస్తారు. 22న సాయంత్రం 4గంటల వరకు అభ్యంతరాల స్వీకరణ, 24న బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రదర్శన, 29న చేతులు ఎత్తే విధానంలో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ఉంటాయి.

నాలుగేళ్ల తర్వాత

ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలను రెండేళ్లకోసారి ఎన్నుకోవాలి. 2019 నవంబర్‌లో నిర్వహించిన ఎన్నికల కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం పొడిగించడంతో ఇప్పటివరకు కొనసాగుతున్నాయి. పాఠశాలలు ప్రజల భాగస్వామ్యంతో పని చేసేలా సౌకర్యాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికితోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. అంతకుముందు 1992లో పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత విద్యకమిటీలను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కమిటీలను యాజమాన్య కమిటీలుగా మార్చారు. ఎన్నికల్లో గెలుపొందిన ఎస్ ఎంసీలు పాఠశాల అభివృద్ధితోపాటు మంజూరు చేసే నిధులను సక్రమంగా ఖర్చయ్యేలా చూడాల్సి ఉంటుంది. నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు, మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ, బడీడు పిల్లలను బడికి రప్పించడం, పిల్లల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి హాజరు, ప్రగతిపై చర్చించడం తదితర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్న నేటి పరిస్థితుల్లో కమిటీలను భాగస్వామ్యం చేయడం ద్వారా సమస్యలు అధిగమించే అవకాశాలున్నాయి. నూతన కమిటీలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని అంటున్నారు.

ఎన్నికలు ఇలా..

జిల్లాలో 714 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, పాఠశాలలు, 86 వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలు, 18 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, 5 ఆదర్శ పాఠశాలలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 1–8 తరగతుల్లో ప్రతీ తరగతి నుంచి ముగ్గురు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు తప్పనిసరి. చేతులు ఎత్తే విధానం ద్వారా సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సభ్యుల్లో నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. తర్వాత కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి పాఠశాల స్థితిగతులపై చర్చిస్తారు.

ఇక మాతృశాఖలకు..

- ఫారిన్ సర్వీసుల్లో అధికారులు వెనక్కి
- డిప్యూటేషన్లు రద్దు చేస్తున్న రాష్ట్ర సర్కారు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గత కొన్నేళ్లగా వివిధ శాఖలకు డిప్యూటేషన్లపై వెళ్లిన అధికారులను తిరిగి మాతృశాఖకు పంపించేందుకు రాష్ట్ర సర్కారు కసరత్తు చేస్తోంది. జిల్లాలో సుమారు 1100 మంది వరకు రెగ్యూలర్ ఉద్యోగులు ఉండగా, కార్పొరేషన్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనూ సిబ్బంది పని చేస్తున్నారు. కొందరు తమ సౌకర్యం కోసం సొంత శాఖలో కాకుండా వేరే శాఖల్లో పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొత్త జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీలు ఏర్పడిన క్రమంలో చాలా చోట్ల సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో ఉద్యోగుల సర్దుబాటులో భాగంగా ఇతర జిల్లాలకు ఇక్కడి నుంచి కొందరు ఉద్యోగులు వేరే చోట్లకు డిప్యూటేషన్లపై వెళ్లారు. వారందరినీ తిరిగి మాతృశాఖకు పంపించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. జిల్లాలోనూ ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిలో ఉన్న అధికారులు, సిబ్బందికి మార్పులు జరగనున్నాయి. డిప్యూటేషన్ల పేరుతో కొందరు ఇతర శాఖల్లో చేరిపోయారు. అలాంటి వారికి ప్రస్తుతం బదిలీలు అనివార్యం కానున్నాయి.

విద్యాశాఖలో డిప్యూటేషన్లు అధికం

జిల్లా విద్యాశాఖలో డిప్యూటేషన్లపై అధికంగా పని చేస్తున్నారు. బోధన, బోధనేతర విభాగాల్లోనూ తమ విధులు కాకుండా పాలన, మినిస్ట్రీయల్ స్టాఫ్‌గానూ పని చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన వారూ కార్యాలయ పనుల్లో ఉంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల పీఏలుగా ఇద్దరు, ముగ్గురు అధికారులు వేరే శాఖల నుంచి పని చేశారు. చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలకు పని చేశారు. సింగరేణి ఉద్యోగులు సైతం తమ శాఖ నుంచి వేరే శాఖలకు, కార్పొరేట్, హెడ్ ఆఫీసుల్లోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి వారందరికీ స్థాన చలనం కల్పించేందుకు రంగం సిద్ధమైంది. రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, సాగునీటి, మిషన్ భగీరథ, విద్యుత్, మున్సిపల్, ఇంజినీరింగ్, సహకార, పలు కార్పొరేషన్లు, ఇతర శాఖల నుంచి ఉన్నారు. వీరితోపాటు కొందరు రాష్ట్ర రాజధానిలో తమ సౌకర్యం కోసం ఆయా శాఖ నుంచి సచివాలయం, నగర పాలక సంస్థల్లోనూ పని చేసేందుకు వినతులు అందజేశారు. కొత్త ప్రభుత్వం రావడంతో ప్రస్తుతం అలాంటి రద్దు చేయడంతోపాటు గత సర్కారులో తమ సొంత శాఖను వదిలి(ఫారిన్ సర్వీస్) ఇతర చోట్ల పని చేస్తున్నవారందరికీ తాజా నిర్ణయం ఇబ్బందికరంగా మారింది.

చైర్మన్ కుర్చీ దక్కేదెవరికో..!

- ఫిబ్రవరి 3న అవిశ్వాస తీర్మానంపై సమావేశం
- చైర్మన్, వైస్ చైర్మన్‌ల కోసం మంతనాలు



లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం ఉత్కంఠ రేకెత్తిస్తోంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బలం పెరిగింది. పది మంది కౌన్సిలర్లు ఈ నెల 6న కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అవిశ్వాసం నోటీసును అందజేయగా.. వచ్చే నెల 3న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ప్రకటించారు. బల్దియాలో 15 స్థానాలకు గాను తొమ్మిది మంది టీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కౌన్సిలర్లు పార్టీ మారారు. బీఆర్ఎస్ నుంచి నలుగురు, ఒకరు స్వతంత్ర కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరికతో ఆ పార్టీ బలం పదికి చేరింది. ప్రస్తుత చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉండడంతో కొత్తగా ఎవరిని ఎన్నుకోవాలో ఎమ్మెల్యేతో మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఏడాదిలో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల వచ్చే అవకాశం ఉండడంతో అవకాశాన్ని దక్కించుకోవాలని కొందరు పైరవీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పది మందితోపాటు అవిశ్వాసం నెగ్గడానికి మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. చైర్మన్ స్థానం కోసం మూడో వార్డు కౌన్సిలర్ నాగభూషణం, వైస్‌చైర్మన్‌గా ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాందేని వెంకటేష్ బరిలో ఉన్నట్లు సమాచారం. దాదాపుగా వీరి పేర్లు ఖరారైనట్లు తెలుస్తోంది.

వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: రానున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలని, జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానంలో నిలబెట్టాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారులతో వార్షిక పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధనకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గత సంవత్సరం ఫలితాలను సూక్ష్మస్థాయిలో విశ్లేషణ చేసి, తక్కువ ఉత్తీర్ణత, ఫలితాల నమోదుకు గల కారణాలను విశ్లేషించుకుని పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం సమన్వయ అధికారి దామోదర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి భీమ్‌రావు, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, యశోధర, సత్యనారాయణమూర్తి, మండలాల విద్యాధికారులు పోచయ్య, ప్రభాకర్, మహేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాధకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఓటు లాంటిది ఇంకొకటి లేదు– నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో అర్హులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు.

ఓటరు జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2024లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం అదనపు ఎన్నికల అధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 జనవరి 1ను ప్రామాణికంగా తీసుకుని 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతుల వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు నోటీసులు జారీ చేయాలని, పేరు, చిరునామా మార్పులు, సవరణలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు జాబితాలో నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూర్ సబ్ కలెక్టర్ సిడాం దత్తు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానం



ప్రచార స్టిక్కర్లు వేస్తున్న డీటీఓ కిష్టయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రతలో భాగస్వామ్యం అవుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకుంటారని జిల్లా రవాణా శాఖా అధికారి(డీటీఓ) ఎల్.కిష్టయ్య అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచార కరపత్రాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లను ఆటోలు, ఆటోట్రాలీలకు ఏర్పాటు చేయించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్, రవాణా శాఖా సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లతో సీఎంఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2022–23 వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ లక్ష్యాలను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పని చేసి రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ పెండింగ్ ఉంటే మళ్లీ ధాన్యం కేటాయించరాదని అన్నారు. ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న రైస్‌మిల్లుల యాజమానులు ఇతర మిల్లుల సమన్వయంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని చెప్పారు. సీఎంఆర్ పూర్తి చేయని మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మిల్లుల నుంచి సీఎంఆర్ పంపించే వాహనాలను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతీరోజు పౌరసరఫరాల శాఖ మేనేజర్ లక్ష్యాల సాధనపై పరిశీలన చేసి నివేదిక అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌరసఫరాల శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి మరింత పెంచాలి



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనిలో ఉత్పత్తిని మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్, ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీలోకి దిగి పని స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను అధికారులు ఆయనకు వివరించారు. అక్కడే ఉన్న సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ఓబీ ఉత్పత్తిని మరింత పెంచాలని సూచించారు. ఓబీ అనుకున్న లక్ష్యం ప్రకారం తీసినప్పుడే బొగ్గు ఉత్పత్తి అనుకున్నంత తీయవచ్చన్నారు. అనంతరం క్వారీ విస్తరణకు అవసరమయ్యే 162 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి బదలాయించే చర్యలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి వీ.పురుషోత్తంరెడ్డి, గని మేనేజర్ సుధీర్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

జీవితం కోల్పోవద్దు..!

- భద్రతే లక్ష్యం కావాలి
- 14 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు
- జీరో ప్రమాద జిల్లా లక్ష్యంగా ముందుకు..



హాజీపూర్ మండలం ముల్కల్లలో అదుపుతప్పి కల్వర్టులో బోల్తా పడిన కారు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'అమ్మ జన్మనిస్తుంది.. భద్రత పునర్జన్మనిస్తుంది..' ఇది అందరికీ తెలిసిన నానుడే అయినా.. రోడ్డు భద్రత పాటిస్తేనే జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ప్రమాదాలు నివారించాలనే లక్ష్యంతో కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ యేటా రహదారి భద్రత వారోత్సవాలు, మాసోత్సవాల పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది కొత్తగా మాసోత్సవాలు(నెల రోజులపాటు) నిర్వహిస్తుండగా అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తోంది. జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా, పంచాయతీ రాజ్, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖ, రహదారులు–భవనాల శాఖ, ప్రజారవాణా, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతోపాటు అన్ని శాఖల సహకారంతో రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం కాగా వచ్చే నెల 14వరకు నిర్వహించనున్నారు. పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రణాళికలు విశ్లేషిస్తూ కార్యక్రమాలు రూపొందించారు. జిల్లాను జీరో ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.

అవగాహన లేక..

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది 263 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 104 మంది మరణించగా 184 మంది క్షతగాత్రులయ్యారు. సరైన రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడంతో పలు వాహనదారులు, యువత తమ జీవితాలను కోల్పోయారు. వాహనాలు నడపడంలో సరైన అవగాహన లేకపోవడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రతీ రోజు కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండడంతో రోడ్డు భద్రతపై అవగాహన లేక ప్రమాదాలు పెరుగుతున్నాయి.

వాహనదారులకు అవగాహన

రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతూ ప్రమాదాల నివారణకు చర్యలపై సమీక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,82,446 వివిధ రకాల వాహనాలు ఉన్నాయి. జిల్లాలో వివిధ జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. అనేక రాష్ట్రాల నుంచి భారీ సరుకు రవాణా వాహనాలు కూడా ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో పలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాల్లో మరణాలు సంభవించడంతోపాటు క్షతగాత్రులుగా మిగిలిన వారితో కుటుంబాలు తీరని వ్యథను అనుభవిస్తున్నాయి. కొన్ని ప్రమాదాల్లో పెద్దయెత్తున ప్రాణనష్టం సంభవిస్తుండగా ఆ కుటుంబాల్లో విషాదం మిగులుతోంది. గత ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, గాయపడిన వారి సంఖ్య, మరణించిన వారి వివరాలతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై నమోదైన కేసులు తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని నివారణకు మాసోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆటోలు, లారీలు, టిప్పర్లు, బస్సులు తదితర వాహనదారులు, డ్రైవర్లను రోడ్డు ప్రమాదాల నివారణపై చైతన్యం చేస్తున్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, మితిమీరిన వేగం, రాంగ్‌రూట్ డ్రైవింగ్ తదితర అంశాలతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం, వాటి వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. మాసోత్సవాల్లో మాత్రమే పోలీసులు, రవాణా శాఖా అధికారులు కార్యక్రమాలు చేపడుతుండగా వాహనదారులు చైతన్యం కావడం లేదని, ఏడాది పొడవునా భద్రత కార్యక్రమాలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుకుంటున్నారు.

గత ఏడాది ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు	263
క్షతగాత్రులు	184
మృతులు	104

జిల్లాలో

ద్విచక్ర వాహనాలు	2,18,002
ఆటో రిక్షాలు	14,028
కార్లు, జీపులు	23,860
ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు	14,004
విద్యాసంస్థల వాహనాలు	471

ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం



వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేస్తున్నాం. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం వంటి నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూస్తాం. లేనిపక్షంలో భారీ మొత్తంలో జరిమానా విధించడం, వాహనాలు సీజ్ చేయడం జరుగుతుంది. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే వాహన చోదకులు ఇబ్బందులు పడక తప్పదు. రోడ్డు భద్రత నియమాలు పాటించి రక్షణతోపాటు కుటుంబానికి భరోసా కల్పించాలి.
– ఎల్.కిష్టయ్య, జిల్లా రవాణా శాఖ అధికారి, మంచిర్యాల

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

నెన్నెల(భీమిని): అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కన్నెపల్లి పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యాన్ని కన్నెపల్లి మండలం రెబ్బెన నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. స్వాధీనపర్చుకున్న బియ్యం, బొలెరో వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కన్నెపల్లికి చెందిన బియ్యం వ్యాపారి బండ గణేశ్‌తో పాటు ముత్తాపూర్‌కు చెందిన డ్రైవర్ చింతలూరి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పట్టుకున్న రేషన్ బియ్యం

ఆసిఫాబాద్: దద్దాపూర్‌కు చెందిన గువ్వల కృష్ణ ఇంటి వద్ద అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ పట్టుకున్నారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యాన్ని స్థానిక మండల స్థాయి గిడ్డంగికి తరలించారు.

కొర్విచెల్మలో బయల్పడ్డ రాముడి విగ్రహం!


విగ్రహం వద్ద స్థానికులు

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మలో పురాతన రాతి విగ్రహం బయటపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతం లచ్చన్న తన వ్యవసాయ పొలం వద్ద మూడురోజుల క్రితం సాగునీటి కోసం బావి తవ్వించాడు. బావి తవ్వే క్రమంలో మట్టిని కుప్పగా పోశాడు. శుక్రవారం ట్రాక్టర్ ద్వారా దానిని లెవల్ చేసే క్రమంలో ఓ పురాతన విగ్రహం బయటపడింది. కాగా, అది శ్రీరాముడి విగ్రహం అని స్థానికులు భావిస్తున్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ పతిష్ఠాపనోత్సవాలు జరిగే సమయంలో రాముడి విగ్రహం బయటపడటంతో వారు పూజలు చేశారు.

చోరీ ఘటనపై విచారణ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై చంద్రకుమార్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గని ఆవరణలో బుధవారం జరిగిన కేబుల్ దొంగతనంపై శుక్రవారం ఎస్సై చంద్రకుమార్ విచారణ చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దొంగలు చొరబడ్డ సమయంలో డయల్ 100, పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు ఫోన్ చేయలేదని సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నించారు. గనులపై తగిన రక్షణ ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సింగరేణి సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆహో రామా.. అయోధ్య రామా..

- 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన
- ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం
- శుభ ఘడియ కోసం నిరీక్షిస్తున్న భక్తజనం
- ఉమ్మడి జిల్లాలోని పలువురికి ఆహ్వానం
- ఇప్పటికే అయోధ్యపురికి భక్తుల పయనం

నెట్‌వర్క్: ఐదు శతాబ్దాల అపురూప స్వప్నం సాకారమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరగబోతోంది. యావత్ భారతావని సంబరాల్లో మునిగి తేలే శుభసమయం ఆసన్నమవుతోంది. అయోధ్యలో నిర్మితమైన భవ్యమందిరంలో శ్రీరాముడు ఈ నెల 22వ తేదీన కొలువుదీరబోతున్నాడు. ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా చూసి తరించేందుకు భక్తజనం ఎదురుచూస్తోంది. ఇప్పటికే రాములోరి అక్షింతలతో శోభాయాత్ర, ఇంటింటా పంపిణీ కార్యక్రమాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయోధ్యలో రామమందిర నిర్మాణం తలపెట్టాలని ఆనాడు జరిగిన కరసేవలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. అలాంటివారితోపాటు మరికొందరికి ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనేందుకు రావాలని ఆహ్వానం అందింది. దీంతో ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వారు ఇప్పటికే అయోధ్యకు వెళ్లారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే..





అణువణువునా రామనామమే..



నిర్మల్ ఖిల్లా: నిర్మల్ జిల్లాలో రామజన్మతీర్థ క్షేత్ర ట్రస్ట్ పిలుపుతో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ లాంటి పలు ఆధ్యాత్మిక సంఘాల సమన్వయంతో రామమందిర నిర్మాణానికి చెందిన నిధి సేకరణ పూర్తి చేశాం. పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం విజయవంతం చేశాం. జిల్లా ప్రజలు ఈనెల 22వ తేదీనాటి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించేందుకు ఎదురుచూస్తున్నారు.

– సాదం అరవింద్, నిర్మల్

మదినిండా ఆనందంతో..



నిర్మల్ ఖిల్లా: వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీరామ చరిత అందరికీ స్ఫూర్తివంతమైనదే. ప్రతీ భక్తుడు కలలుగానే అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంది. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేళ అందరి మదినిండా ఆనందం వెల్లివిరుస్తోంది.

– కిన్నెర్ల రవి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడు, నిర్మల్

కల నిజమవుతోంది



నిర్మల్ ఖిల్లా: రద్దీ దృష్ట్యా నిర్మల్ జిల్లా నుంచి అయోధ్య రాముడి దర్శన భాగ్యం కొంతమందికే దక్కింది. ఫిబ్రవరి 19న అయోధ్య దర్శనం కోసం దాదాపు 50 మంది వరకు ఆహ్వానం లభించింది. వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాం. 1990 ప్రాంతంలో కరసేవకులుగా ఇక్కడి నుంచి అనేకసార్లు అయోధ్య వెళ్లాం. ప్రస్తుతం రామ మందిరం కల నెరవేరుతుండటం సంతోషంగా ఉంది.

– మంచిరాల నాగభూషణం, అక్షింతల పంపిణీ సంయోజకుడు, నిర్మల్

పూర్వజన్మ సుకృతం



నిర్మల్ ఖిల్లా: శ్రీరాముడి భక్తుడిగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మరో రెండ్రోజుల్లో అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించే అదృష్టాన్ని నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– గోనెల శశిరాజ్, నిర్మల్

కుభీర్ నుంచి పాదయాత్రగా..


పాదయాత్రగా వెళ్తున్న జాదవ్ మాధవ్

కుభీర్: మండలంలోని కుభీర్ గ్రామానికి చెందిన జాదవ్ మాధవ్ గత నెల 27న అయోధ్యకు వెళ్లేందుకు పాదయాత్ర ప్రారంభించాడు. స్థానిక విఠలేశ్వర మందిరం నుంచి కాలినడకన బయలుదేరాడు. అయోధ్యకు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు శుక్రవారం తెలిపాడు. ఇప్పటివరకు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయిందని పేర్కొన్నాడు. రోజుకు 40కిలో మీటర్లకుపైగా నడుస్తున్నట్లు తెలిపాడు. మరో రెండ్రోజుల్లో అయోధ్యకు చేరుకోనున్నట్లు పేర్కొన్నాడు.

సైకిల్‌పై ఉట్నూర్ నుంచి అయోధ్యకు..


ఉట్నూర్ నుంచి బయలుదేరుతున్న యువకులు (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన జాదవ్‌రాజేశ్వర్, భీమేశ్వర్ అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు 22రోజుల క్రితం సైకిల్‌పై వెళ్లారు. ఇప్పటికే వారు యూపీ చేరుకున్నట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 22న నిర్వహించే రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.

సంతోషాన్ని మాటల్లో చెప్పలేను



ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రారంభమవుతున్నందున సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. కరసేవకు వెళ్తున్న సమయంలో బీజేపీ అగ్రనేత ఎల్కే అద్వాని సూచన మేరకు ప్రయాణాన్ని సాగించాం. డిసెంబర్ 6వ తేదీకి అయోధ్యకు చేరుకోలేకపోయామన్న బాధ ఇప్పటికీ వేధిస్తోంది. 14 రోజుల జైలు అనంతరం అయోధ్యకు వెళ్లి రామచంద్రుడిని దర్శించుకోవడంతో నా జన్మ ధన్యమైంది. దేశంలో రామరాజ్య స్థాపన ప్రారంభమవుతుండడంతో ప్రజలు సుఖఃసంతోషాలతో జీవిస్తారు.

– సుబ్బా తిరుమల్, కరసేవకుడు, ఆసిఫాబాద్

జన్మ ధన్యమైంది



ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలో శ్రీరామచంద్ర ఆలయ ప్రారంభోత్సవాన్ని చూడబోతున్నందుకు నా జన్మ ధన్యమైంది. 1992లో నేను కరసేవకు ఆసిఫాబాద్ నుంచి 15మందితో కలిసి అయోధ్యకు వెళ్లాను. మార్గంమధ్యలో పోలీసులు అరెస్ట్ చేసి అలహాబాద్‌లోని జైలులో 16 రోజులు ఉంచారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కరసేవకు వెళ్తున్న మార్గంలో అనేక మంది సహాయ, సహకారాలు జీవితంలో మరువలేను. కరసేవలో ఎన్ని కష్టాలు ఎదురైనా సంతోషంగా స్వీకరించాం. ఈ జన్మకు నా జీవితంలో ఇంతకంటే ముఖ్యమైన ఘట్టం ఏదీలేదు.

– దండనాయకుల చంద్రకాంత్, కరసేవకుడు, ఆసిఫాబాద్

ఏళ్ల కల నెరవేరింది



ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అయోధ్యలోని రామాలయ ప్రారంభ కల నెరవేరింది. కరసేవకులుగా బయలుదేరుతున్న సమయంలో నా వయస్సు 20 ఏళ్లే. మా నాన్న ప్రోత్సాహంతో ధైర్యంగా కరసేవకు వెళ్లాను. పోలీసులు అరెస్ట్ చేసి నైనీ జైలులో 14 రోజులు పెట్టారు. అడుగడుగునా పోలీసులు లాఠీచార్జి చేయగా గాయాలయ్యాయి. వారం రోజులు ఆహారం దొరకక నీళ్లు తాగి గడిపాం. ఎన్ని ఆటంకాలు ఎదురైనా అయోధ్యకు చేరుకున్నాం. 22వ తేదీన ఆలయం ప్రారంభమవుతున్నందున దేశ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతీ ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలి.

– కొడిపాక వేణుగోపాల్, కరసేవకుడు, ఆసిఫాబాద్

దేదీప్యమానంగా వెలగాలి

ఆదిలాబాద్: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరగనున్న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం అందింది. శ్రీరామ, హనుమత్ భక్తులు, హిందూ ధర్మ పరిరక్షకుల ప్రతినిధిగా అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవం, శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వెళ్తున్నాను. జనవరి 22 కన్నా ముందే ఆలయంలో నిర్వహించే పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, క్రతువుల్లో పాలుపంచుకుంటాను. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ తమ నివాసాల్లో దీపాలు వెలిగించి దీపావళి మహోత్సవంలా జరుపుకోవాలి. ప్రతీ ఇల్లు దీప కాంతులతో దేదీప్యమానంగా వెలగాలి.

– యోగానంద సరస్వతి స్వామి


అయోధ్యకు బయలుదేరుతున్న స్వామి

పిలుపురావడం అదృష్టం



ఇచ్చోడ: అయోధ్యలో రాములోరి విగ్రహప్రతిష్ఠాపనకు పిలుపు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. పదిహేనేళ్ల నుంచి గోశాల నిర్వహిస్తూ గోమాతలకు రక్షణ కల్పిస్తున్న. అయోధ్య రామాలయ నిర్మాణం కోసం నావంతుగా 2019లో ఇటుకలను తీసుకుని ఇచ్చోడ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేశాను. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనడం గోమాతల ఆశీస్సులే కారణం.

– ఐద రాజేశ్, జైశ్రీరాం గోశాల నిర్వాహకుడు, ఇచ్చోడ

చాలా ఆనందంగా ఉంది



బజార్‌హత్నూర్: మారుమూల ప్రాంతం నుంచి పవిత్రమైన అయోధ్యలోని బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందడం చాలా ఆనందంగా ఉంది. గ్రామానికి చెందిన పండరి, నేను గతేడాది బజార్‌హత్నూర్ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేశాం. దీంతో అక్కడి నుంచి మా ఇద్దరికి ఆహ్వానం అందింది. మా సోదరుడు బొజ్జవార్ సంతోష్ 1991లో కరసేవకుడిగా అయోధ్యకు వెళ్లాడు. మాతో పాటు అతడికీ ఆహ్వానం అందింది.

– బొజ్జవార్ వీరనందయ్య, బజార్‌హత్నూర్

పూర్వజన్మ పుణ్యఫలం



ఇచ్చోడ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ప్రత్యక్షంగా చూసే భాగ్యం దొరకడం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలమే. ఇలాంటి అపురూప ఘట్టం చూసే అవకాశం చాలా తక్కువ మందికే దొరుకుతుంది. అయోధ్యలో రాముడి విగ్రహప్రతిష్ఠాపన రోజు స్వయాన రాముడు మరోసారి ఈనేలపై నడయాడుతున్నట్లుగా ఉంటుంది. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చరిత్రాత్మకం.

– నారాయణ మహరాజ్, వైష్ణవ సదన్ పీఠాధిపతి, మాదాపూర్

ఆహ్వానం రావడం అదృష్టమే



కడెం: రామమందిర నిర్మాణం, రాముడి కోసం అనేక సందర్భాల్లో ఉద్యమం చేశాం. దాని ఫలితంగా అయోధ్య రామమందిరం నుంచి ఆహ్వానం అందడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్న. 30 ఏళ్లుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ, భజరంగ్‌దల్ తదితర విభాగాల్లో నిస్వార్థంగా పని చేసిన. నన్ను గుర్తించి ఆహ్వానం పంపడం ఆనందంగా ఉంది. రద్దీ దృష్ట్యా ప్రారంభోత్సవం తర్వాత అయోధ్యకు వెళ్తాం.

– అమరవేణి రవీందర్‌గౌడ్, కడెం

చాలా సంతోషంగా ఉంది



ఇంద్రవెల్లి: నాకు అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానం రావడం చాలా సంతోషంగా ఉంది. అయోధ్యలోని పుణ్యభూమిపై అడుగుపెట్టే అవకాశం రావడం ఆ రాముడి దయగా భావిస్తున్న. దేవగిరి నుంచి నాకు ఆహ్వానం రావడానికి కారణమైన నా గురువు సురేశ్ మహరాజ్‌కు రుణపడి ఉంటా. ఈ నెల 17న ఆదిలాబాద్ నుంచి బయల్దేరి అయోధ్యకు చేరుకున్న.

– జైస్వాల్ శివకుమార్, ముత్నూర్

అదృష్టంగా భావిస్తున్న



ఇంద్రవెల్లి: ఏమాయికుంట కాలుబాబా ఆలయ మహరాజ్‌గా ఉన్న నేను విశ్వహిందూ పరిషత్ మహారాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న. మొదటి నుంచే ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ కాలుబాబా భక్తుడినయ్యా. శ్రీరాముడి సేవామార్గంలో ఉంటూ భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్న. నాకు దేవగిరి నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వానపత్రం రావడం అదృష్టంగా భావిస్తున్న.

– సురేశ్‌మహరాజ్

ఆశీర్వాదం తీసుకుంటా



ఇంద్రవెల్లి: అయోధ్య రాములోరి జన్మభూమిపై అడుగుపెట్టే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. నా జన్మ ధన్యమైందని భావిస్తున్న. భారత దేశ పుణ్యభూమిలో ప్రజలను సుఖఃసంతోషాలతో ఉంచాలని వేడుకుంటా. నా తోటి ప్రజల కోసం అయోధ్య రాముడి ద్వారా ఆశీర్వాదం తీసుకుంటా.

– కొరెంగా యశ్వంత్‌రావ్

హ్యుందాయ్ కొత్త క్రెటా ఆవిష్కరణ


క్రెటా కారును ఆవిష్కరిస్తున్న ఎండీ నల్ల దినేశ్‌రెడ్డి

మంచిర్యాలక్రైం: హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా కొత్త క్రెటా కారును విడుదల చేసింది. గద్దెరాగడి ప్రాంతంలోని ప్రకాశ్ హ్యుందాయ్ షోరూంలో ఎండీ నల్ల దినేశ్‌రెడ్డి, మంచిర్యాల ఎస్‌బీఐ మేనేజర్ సత్యరాజ్‌కుమార్, హైటెక్ కాలనీ బ్రాంచ్ మేనేజర్ సంజీబ్‌కుమార్ సాహు 2024 హ్యుందాయ్ క్రెటా కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ నల్ల దినేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎందరో కష్టమర్ల మన్ననలు పొందిన క్రెటా కారును సరికొత్తగా అత్యాధునిక టెక్నాలజీతో మార్కెట్‌లోకి తీసుకురావటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ డైనమిక్ ఎస్‌యూవీ క్వాడ్ బీమ్, ఎల్ఈడీ హెడ్ ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్ లెవల్–2 ఏడీఏఎస్ లాంటి ఫీచర్లకు తోడు 'సెన్సుయస్ స్పోర్టినెస్' డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగి ఉందని వివరించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ రాజ్‌కుమార్, టీఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పెర్సాపెన్‌కు పూజలు


పూజల్లో పాల్గొన్న మొకాశి వంశీయులు

దండేపల్లి: మొకాశిగూడలోగల జల్లి దేవర (పెర్సాపెన్) ఆలయంలో ఉమ్మడి జిల్లాలోని కోవ వంశీయులు శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో జల్లిదేవరను తీసి గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో ఆలయానికి చేరుకున్నారు. సమీప గోదావరిలో స్నానాలు ఆచరించారు. మొకాశిగూడకు చేరుకుని జల్లిదేవరను యథాస్థానంలో నిలిపి పూజలు చేశారు.

మూడోరోజు అదే జోరు..


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు


బాక్సింగ్‌లో తలపడుతున్న విద్యార్థులు


క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న అధికారులు

- పోటాపోటీగా ఐఎస్ఎల్ క్రీడలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ప్రారంభమైన ఏడో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడలు మూడోరోజు కొనసాగాయి. శుక్రవారం బాక్సింగ్, కుస్తీ, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. అండర్–17లో 1500 మీటర్ల పరుగు పందెంలో సంతోష్ (సోషల్ వెల్ఫేర్ సొసైటీ) గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో రామకృష్ణ (జ్యోతిబాపులే సొసైటీ) గోల్డ్ మెడల్, అండర్–19 పరుగు పందెంలో నెనావత్ ధోని (ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ) గోల్డ్ మెడల్, హైజంప్‌లో వెంకటేశ్‌రావు (స్టార్ సొసైటీ) భద్రాచలం గోల్డ్ మెడల్, అండర్–17 బాలికల విభాగంలో 1500 రన్నింగ్‌లో ఎం.దివ్యశ్రీ (స్టార్స్ సొసైటీ) హైదరాబాద్ గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో పి.నికిత (సోషల్ వెల్ఫేర్ సొసైటీ) గోల్డ్ మెడల్ సాధించారు. విజేతలకు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఆయా సొసైటీల క్రీడాధికారులు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత


బాలుడిని కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ బాలుడిని తమ సిబ్బంది గుర్తించినట్లు జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైల్వేస్టేషన్‌లోని శుక్రవారం ఒకటో ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 10 ఏళ్ల బాలుడిని జీఆర్పీ పోలీసులు దగ్గరకు తీసుకుని విచారించారు. కాగా, జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడకు చెందిన బండారి శివప్రసాద్ కుమారుడు గణేశ్‌గా తెలుసుకున్నారు. తనకు చదువు ఇష్టం లేకున్నా తరచూ తన తల్లిదండ్రులు బడికి పోవాలని ఒత్తిడి చేస్తున్నారని గణేశ్ తెలిపాడు. దీంతో అతడి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి బాలుడిని అప్పగించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై విజయ్, జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


ప్రమాదస్థలిలో మృతదేహం

ఆసిఫాబాద్: మండలంలోని సాలెగూడ సమీపంలోని నేషనల్ హైవేపై శుక్రవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. నేషనల్ హైవే అథారిటీకి చెందిన వాహనంలో మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారయ్యాడు. ఎస్సై మహేందర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, మృతులు తాండూర్ మండలానికి చెందిన మోహన్ (32), గౌర్రయ్య (50)గా భావిస్తున్నారు.

ఇద్దరిపై కేసు

మందమర్రిరూరల్: మామిడిగట్టులో గురువారం రాత్రి సుమారు 8.30 గంటలకు జరిగిన గొడవ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మామిడిగట్టు గ్రామ యువకులు గజ్జె రఘు, అంజితో అదే గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మణ్, దుర్గం రవికుమార్ మద్యం తాగి గొడవకు దిగారు. దాడి చేసేందుకు అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహం గోడలోకి అక్రమంగా ప్రవేశించారు. ప్రహరీ స్టీల్ రాడ్‌ను బయటకు తీశారు. సర్పంచ్ రాయలింగు ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మణ్, రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.